సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



బిల్లులు ఎప్పుడిస్తారో..?

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు నిత్యావసర సరుకుల బిల్లులు, సిబ్బందికి వేతనాలు సకాలంలో అందడం లేదు. 8లో



ఎస్సెస్సీ విద్యార్థులపై శ్రద్ధ

గిరిజన ఆశ్రమ పాఠశాలల పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
$33^{\circ} / 18^{\circ}$

వాతావరణం

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు గంటగంటకూ పెరుగుతాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

● ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: అడవి జంతువులను వేటాడటానికి ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ బి.రోహిత్‌రాజ్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వేటగాళ్లు కరెంట్ తీగలు అమర్చడంతో పొలం పనులకు వెళ్లే రైతులు, జంతువులు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో ఇలాంటి ఘటనలు జరిగాయని గుర్తుచేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదివారం రాత్రి భూపాలపల్లి జిల్లాలో అడవిలో అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి కూంబింగ్ విధులు నిర్వహిస్తున్న ఒక పోలీస్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. అడవిలో అక్రమంగా విద్యుత్ తీగలు అమరుస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

పాలకుర్తిలో ఎస్పీ పూజలు



స్వామికి అభిషేకం చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

పాలకుర్తి టౌన్: జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఎస్పీ బిరుదురాజు రోహిత్‌రాజ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశాక, అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, బండి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుండి ప్యాసింజర్ రైళ్లు

కొత్తగూడెంఅర్బన్: మూడో రైల్వేలైన్ పనులతో కొన్నినెలలుగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు. ప్రస్తుతం పనులు పూర్తికా వడంతో మంగళవారం నుండి ప్యాసింజర్ రైళ్ల రాకపోకలు మొదలుకానున్నాయని ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. ఈమేరకు డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756), భద్రాచలం రోడ్ – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్(07979) ప్యాసింజర్ రైళ్లు పాత సమయం ప్రకారమే నడుస్తాయని ఆయన వెల్లడించారు.

అంగన్‌వాడీలకు కోయభాషలో పుస్తకాలు



అంగన్‌వాడీ పిల్లలతో భాషా శాస్త్రవేత్తలు

దుమ్ముగూడెం: మైసూర్‌కు చెందిన సీఐఐఎల్‌తో పాటు ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యాన ఆదివాసీ గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల కోసం కోయభాషలో వర్ణమాల పుస్తకాలు రూపొందించారు. వీటిని ప్రయోగాత్మకంగా భద్రాద్రి జిల్లాలోని పలు కేంద్రాలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐఐఎల్ సంస్థకు చెందిన భాషా శాస్త్రవేత్తలు ఎల్ఆర్.ప్రేమ్‌కుమార్, దూపుకుట్ల రమేష్, భూషణ్ సోమవారం దుమ్ముగూడెం మండలం చింతగుప్ప గ్రామపంచాయతీ పరిధి తోగూడెం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఈమేరకు వర్ణమాల పుస్తకాలను విద్యార్థులకు చూపిస్తూ అర్థం చేసుకుంటున్న తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కోయ భాష నిపుణులైన పిసోడి కన్నయ్య, పాయం వెంకటరత్నం, హెచ్‌ఎం రవి, అంగన్‌వాడీ టీచర్ జానకి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు డీఎస్పీల బదిలీ



కొత్తగూడెం అర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు ఎస్‌డీపీఓలను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇల్లెందు ఎస్‌డీపీఓ ఎస్.వీ.రమణమూర్తిని కొత్తగూడెంకు, కొత్తగూడెం ఎస్‌డీపీఓ అబ్దుల్ రెహమాన్‌ను వరంగల్ జిల్లా మామునూరు ఏసీపీగా బదిలీ చేశారు. అలాగే, పాల్వంచ ఎస్‌డీపీఓ ఎస్.వెంకటేష్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయగా ఆ స్థానంలో హైదరాబాద్ సిటీ సీసీఎస్ ఏసీపీగా ఉన్న ఎల్.ఆదినారాయణను నియమించారు. కాగా, ఇల్లెందు ఎస్‌డీపీఓగా మాత్రం ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

ఏసీబీ పేరుతో దళారుల దందా!

సింగరేణి కారుణ్య నియామకాల్లో దళారుల సిండికేట్

- ఈ వ్యవహారంపై ఏసీబీ నిఘాకు సీఎండీ చర్యలు
- ఏసీబీ పేరుతో మరింతగా రేటు పెంచిన దళారులు
- నేడు, రేపు కొత్తగూడెం సింగరేణి ఆస్పత్రిలో మెడికల్ బోర్డు



మెడికల్ బోర్డు నిర్వహించనున్న కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆస్పత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణిలో కారుణ్య ఉద్యోగాలకు సంబంధించి నియామక పత్రాలను తొలిసారిగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఉద్యోగార్థులకు అందించారు. ఈ మేరకు కార్మికులను కొత్తగూడెం బదులు హైదరాబాద్‌కు రప్పించారు. రాను పోను చార్జీలు, బస, వసతి కోసం ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ.3,200 వరకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. అనారోగ్య సమస్యలతో కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకునే ఏ కార్మికుడిపై ఆర్థిక భారం పడకూడదనే లక్ష్యంతో సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నది మొదలు నియామక పత్రం అందుకునే వరకు లక్షల రూపాయలు దళారులకు ముట్టజెప్పాల్సి వస్తోంది. పైగా దళారుల దందాకు చెక్ పెట్టేందుకు తీసుకున్న జాగ్రత్తలకు సైతం చెదలు పట్టే స్థాయిలో ఇక్కడ పైరవీల సిండికేట్ కోరలు చాచింది.

పారదర్శకత దిశగా చర్యలు..

కార్మికుల నుంచి లక్షల రూపాయలు దండుకుంటున్న దళారులు క్షేత్రస్థాయిలో ఎంతవరకు ప్రభావం చూపుతున్నారనే అంశంపై ఎవరికీ స్పష్టత లేదు. కానీ వీరి వల్ల సింగరేణి పరిధిలో ఉన్న అన్ని ఏరియాల్లో మెడికల్ బోర్డులో పాస్ కావాలంటే కనీసం రూ.ఐదు లక్షలు సమర్పించుకోక తప్పదనేలా పరిస్థితులు మారాయి. ఈ దందాతో సంస్థకు కూడా చెడు పేరు వస్తోంది. దీంతో ఇటీవల సింగరేణి సీఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎన్. బలరామ్ మెడికల్ బోర్డుపై దృష్టి సారించారు. కారుణ్య నియామకాల్లో పైరవీలు చేయిస్తామని చెప్పుకుంటున్న ఉద్యోగులను గుర్తించి హెచ్చరించారు. మరికొందరిని డిస్మిస్ చేశారు. అంతేకాకుండా విమర్శలు తిప్పికొట్టేందుకు వీలుగా అవినీతి నిరోధక శాఖను తెరపైకి తెచ్చారు. అనుమానాస్పదంగా ఉన్న ఉద్యోగుల కదలికలపై ఏసీబీతో నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఎత్తుకు పై ఎత్తులు..

సింగరేణిలో కారుణ్య నియామకాల ప్రక్రియ 80వ దశకంలో మొదలైంది. ఆ తర్వాత మధ్యలో బ్రేక్ పడినా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మళ్లీ పునరుద్ధరించారు. అయితే ఆది నుంచి మెడికల్ బోర్డులో కాసులతోనే పని జరుగుతుందనే అపవాదు కార్మికుల్లో బలంగా నాటుకుపోయింది. మరోవైపు మెడికల్ బోర్డు విధివిధానాలు, జరిగే తీరు తెన్నులపై సింగరేణి కార్మికులకు సరైన అవగాహన లేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న దళారుల సిండికేట్ మరింతగా రెచ్చిపోతోంది. కారుణ్య నియామకాలు/మెడికల్ బోర్డుపై ఏసీబీ నిఘా ఉందని, ఇకపై మెడికల్ బోర్డులో పనులు జరగడం మరింత కష్టమని చాపకింద నీరులా ప్రచారం చేసిన దళారులు.. కార్మికుల్లో మరింత భయాందోళనలు రేకెత్తించారు. గతంలో మాదిరిగా చేతులు తడిపితే పనులు కావంటూ తప్పుడు సంకేతాలు బలంగా పంపారు. ఫలితంగా గతంలో రూ.ఐదు లక్షల వరకు ముట్టజెప్పాల్సి వస్తే ఇప్పుడా మొత్తం రూ.ఏడు నుంచి ఎనిమిది లక్షల వరకు చేరిందని కార్మికులు అంటున్నారు. దీంతో కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందనే పరిస్థితి సింగరేణిలో నెలకొంది. కాగా, మంగళ, బుధవారాల్లో కొత్తగూడెం సింగరేణి ఆస్పత్రిలో నిర్వహించే మెడికల్ బోర్డులో అయినా ఈ దందాను అరికట్టాలని కార్మికులు కోరుతున్నారు.

దళారుల సిండికేట్

సంస్థలో పని చేస్తున్న కార్మికులు వివిధ అనారోగ్య కారణాలతో గనుల్లో పని చేయలేని పరిస్థితి నెలకొన్నప్పుడు వారి వారసులకు కారుణ్య నియామకాల పేరుతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. మిగిలిన సంస్థలతో పోలిస్తే సింగరేణిలో పని చేసే కార్మికుల్లో ఉండే నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని గడిచిన కొన్నేళ్లుగా కార్మిక సంఘ నాయకులుగా చెప్పుకునే కొందరు, సింగరేణి ఉద్యోగులు కలిసి దళారుల అవతారం ఎత్తారు. వీరంతా సిండికేట్‌గా మారి వారసత్వ ఉద్యోగాల్లో అవినీతి దందాకు రాచబాటలు వేశారు. ఈ క్రమంలో కారుణ్య నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికుల వివరాలు ముందుగానే సేకరిస్తారు. ఆ తర్వాత నేరుగా వారి కుటుంబాలతో టచ్‌లోకి వెళ్తారు. తాము చెప్పినంత ముట్టజెబితే సదరు కార్మికుడికి మెడికల్ బోర్డులో అన్ని పరీక్షలు సాఫీగా సాగుతాయని ప్రలోభపెడతారు. అప్పటికే అనారోగ్య సమస్యతో బాధపడుతుండటం, వారసుడికి సంస్థలో ఉద్యోగం వస్తుందనే ఆశతో కార్మికులు దళారుల వలలో చిక్కుతున్నారు. ఫలితంగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మెడికల్ బోర్డు పేరుతో సగటున రూ.ఐదు లక్షల వరకు వారికి ముట్టజెబుతున్నారు.

17న లోక్ అదాలత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈనెల 17వ తేదీన ఉచిత లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌ల వారీగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడదలచిన క్రిమినల్ కేసులు, ఇ పెట్టి కేసులు, చాలాన్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్, మనోవర్తి, బ్యాంకులు, టెలిఫోన్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

భద్రాద్రిలో ఈ - టికెట్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఈ - టికెట్‌ను ఈఓ రమాదేవి సోమవారం ప్రారంభించారు. గతంలో భక్తులకు దర్శనం, పూజలకు సంబంధించి ముద్రించిన టికెట్లు ఇచ్చేవారు. ప్రస్తుతం కంప్యూటర్ ద్వారా టికెట్లను పంపిణీ చేసే విధానం అందుబాటులోకి తెచ్చారు. కాగా, ఈనెల 22, 23 తేదీల్లో మాఘమాసం సందర్భంగా ఆలయంలో సహస్ర కలశాభిషేకం నిర్వహిస్తున్నందున స్వామివారి నిత్యకల్యాణాలు రద్దు చేసినట్లు ఈఓ రమాదేవి మరో ప్రకటనలో తెలిపారు.

పర్యావరణంపై అవగాహన కల్పించాలి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ

కొత్తగూడెంఅర్బన్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పరిసరాలపై విద్యార్థులకు అవగాహన, పరిశీలన, ఆసక్తి కలిగేలా ప్రేరేపించాలలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలు గెలుచుకున్న విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిశీలకులుగా హాజరైన వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఈనెల 28న సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కో – ఆర్డినేటర్ సంపత్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, న్యాయనిర్ణేతలు మధు, కళ్యాణి, అనురాధ పాల్గొన్నారు.

24 నుంచి డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షలు

ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు డ్రాయింగ్ లోయర్, హయ్యర్, టైలరింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు జరుగనున్నాయని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వివరాలకు ఏసీజీఈ ఎస్.మాధవరావు (99890 27943)ను సంప్రదించాలని సూచించారు.

పలువురు అధికారుల బదిలీ

డీఆర్‌డీఓ, డీపీఓ, సీఈఓ, ఏపీడీలకు స్థాన చలనం

చుంచుపల్లి: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో మూడేళ్లుగా పనిచేస్తున్న జిల్లా స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఆర్డీఓ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ రాజు, డీపీఓ లక్కినేని రమాకాంత్, జెడ్పీ సీఈఓ మెరుగు విద్యాలత, డిప్యూటీ సీఈఓ బి.నాగలక్ష్మి, భద్రాచలం డీఎల్‌పీఓ గుండ్ల పవన్‌కుమార్, సెర్ప్ ఏపీడీ నీలయ్యకు స్థానచలనం కలిగింది. మధుసూదన్‌రాజు తొలుత జెడ్పీ సీఈఓగా జిల్లాకు వచ్చి, డీఆర్డీఓగా, అదనపు కలెక్టర్‌గా విశిష్ట సేవలు అందించారు. రమాకాంత్ మూడున్నరేళ్లుగా జిల్లాలో పనిచేస్తూ గ్రామ పాలనలో తనదైన ముద్ర వేశారు. జెడ్పీ సీఈఓగా విద్యాలత ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. డీఆర్‌డీఓను సూర్యాపేట జిల్లాకు, జెడ్పీ సీఈఓ, డీపీఓలను హన్మకొండ జిల్లాకు బదిలీ చేశారు. ఇక ఖమ్మం డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన, పెద్దపల్లి డీపీఓ వి.చంద్రమౌళి, ములుగు జెడ్పీ సీఈఓ ఎస్.ప్రసూన రాణి, ఖమ్మం డిప్యూటీ సీఈఓ కె.చంద్రశేఖర్ అదే పోస్టుల్లో భద్రాద్రి జిల్లాకు రానున్నారు. సెర్ప్ ఏపీడీ నీలయ్యను ఖమ్మం బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఖమ్మం నుంచి జయశ్రీ ఇక్కడికి వస్తున్నారు.

కీసర ఆర్డీఓగా రామాలయ ఈఓ..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ఈఓ రమాదేవిని కీసర ఆర్డీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది ఫిబ్రవరి 11న ఆలయ ఈఓగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన రమాదేవి.. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాల విజయవంతంలో కీలక పాత్ర పోషించారు. ఏపీలో కలిసిన ఆలయ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడడంలో కృషి చేశారు. కాగా, అలయ అభివృద్ధికి కృషి చేస్తున్న రమాదేవిని బదిలీ చేయడంతో భక్తుల నుంచి నిరసన వ్యక్తమవుతోంది.



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు

భక్తాగ్రేసరుడికి స్వర నీరాజనం

- భద్రాద్రిలో వైభవంగా భక్తరామదాసు జయంత్యుత్సవాలు ప్రారంభం
- కనులపండువగా శోభాయాత్ర
- దేశ, విదేశాల నుంచి హాజరైన సంగీత విద్వాంసులు
- సంగీత సాగరంలో ఓలలాడిన భద్రగిరి



గోదారమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: 'అదిగో భద్రాద్రి.. గౌతమి ఇదిగో చూడండి..' 'తక్కువేమి మనకూ.. రాముండొక్కండుండు వరకు' అంటూ విద్వాంసుల కీర్తనలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల కోలాటాల నడుమ భక్త రామదాసు 391వ జయంత్యుత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భద్రాద్రి రామయ్యను స్మరిస్తూ అజరామర కీర్తనలు రాసి, గానం చేసి అపర భక్తాగ్రేసరుడిగా పేరుగాంచిన భక్త రామదాసుకు స్వరనీరాజనం పలికారు. తొలుత మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తరామదాసు విగ్రహంతో శోభాయాత్ర సాగింది. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. ఆలయ ఈఓ రమాదేవి, చక్ర సిమెంట్స్ అధినేత నేంద్రగంటి కృష్ణమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానం, చక్ర సిమెంట్స్, నేంద్రగంటి అలివేలు మంగ సర్వయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పంచామృతాలతో అభిషేకం..

రామదాసు జయంతిని పురస్కరించుకొని దేవస్థాన ప్రాంగణంలో గల ఆయన విగ్రహానికి అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేసి, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం రామదాసు చిత్రపటంతో గిరిప్రదక్షిణ నిర్వహించి, విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న తూము నరసింహదాసు, కల్యాణ మండపం వద్ద ఉన్న భక్తరామదాసు విగ్రహాల వద్ద పూజలు చేశారు. ఆ తర్వాత గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, సారె సమర్పించారు.

నవరత్న కీర్తనల ఆలాపన..

రామదాసు జయంతి సందర్భంగా భద్రగిరిలో నిర్వహిస్తున్న ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలకు దేశ, విదేశాల నుంచి సంగీత విద్వాంసులు హాజరయ్యారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, వైజాగ్, కేరళ, అమెరికా నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు ఆలపించిన నవరత్న కీర్తనలతో రామదాసుకు స్వర నీరాజనం సమర్పించారు. ప్రఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు, అతని కుమారులు మల్లాది శ్రీరామ్‌కుమార్, రవికుమార్ ఆలపించిన సంకీర్తనలు అందరినీ అలరించాయి. అనంతరం చెన్నై నుంచి వచ్చిన కనకవల్లి, గోకుల కృష్ణ, అమెరికా నుంచి వచ్చిన వివేక్ మునుకుంట్ల, కేరళ నుంచి వచ్చిన విష్ణుదేవ్ నంబూద్రి ఆలపించిన కీర్తనలతో భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఒక్కో కీర్తన ముగియగానే అర్చకులు రామచంద్రమూర్తికి ప్రత్యేక హారతి సమర్పించారు.

'కొడిపెల్లి'కి జాతీయ అవార్డు

మణుగూరు టౌన్: హెచ్‌ఎంఎస్ మణుగూరు ఏరియా నాయకుడు దివంగత కొడిపెల్లి శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించారు. ఈ మేరకు తిరుపతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ సతీమణి శ్రీలత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతి ఏటా ఉద్యమకారులకు, సంఘ సేవకులకు, రచయితలకు, కవులకు ఈ అవార్డులు అందజేస్తారని తెలిపారు. తన భర్త శ్రీనివాస్ సేవలను గుర్తించి అవార్డును ప్రకటించిన సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్ నల్లా రాధాకృష్ణకు, ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌కు స్థల పరిశీలన

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మనగర్‌లో గల మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో టాటా టెక్నాలజీ లిమిటెడ్ వారు నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోసం సోమవారం వరంగల్ రీజినల్ డిప్యూటి డైరెక్టర్ బి.సీతారాములు స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఐటీఐలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఏర్పాటుచేసే ఈ సెంటర్‌కు అవసరమైన వసతులపై చర్చించారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతికతను అందించాలనే ఉద్దేశంతో టాటా కంపెనీ ఈ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్, ట్రైనీ అధికారి జి.రవి పాల్గొన్నారు.

టెండర్లలో జాప్యం



అటవీ ప్రాంతంలోని తునికాకు చెట్లు

- జిల్లాలో ఆరు డివిజన్లు.. 242 తునికాకు యూనిట్లు
- వేసవి సమీపిస్తున్నా మొదలుకాని టెండర్ల ప్రక్రియ
- ఆలస్యమైతే ఉపాధి కోల్పోనున్న కూలీలు
- ఇతర రాష్ట్రాలకు వెళ్తున్న తెలంగాణ కాంట్రాక్టర్లు

పాల్వంచరూరల్ : తునికాకు సేకరణకు ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియలో జాప్యం జరుగుతుండడంతో కూలీల ఉపాధి, ఆదాయ అవకాశాలకు గండిపడే పరిస్థితి నెలకొంది. ప్రతీ సంవత్సరం కూలీలు వేసవి పంటగా భావించే తునికాకు సేకరణకు ఆశగా ఎదురుచూస్తుంటారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల పాటు తునికాకు సేకరిస్తారు. జిల్లాలో కిన్నెరసాని వైల్డ్‌లైఫ్, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు.. ఆరు అటవీ డివిజన్లలో 242 తునికాకు యూనిట్లు ఉన్నాయి. వీటి పరిధిలోని గిరిజన, గిరిజనేతర కూలీలు ఇంటిల్లిపాది తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆకు సేకరించి 100 ఆకులను ఒక కట్టగా కడతారు. వాటిని సమీపంలోని కల్లాల్లో అప్పగిస్తారు. ఇలా మూడు నెలల పాటు సేకరించిన ఆకుతో ఒక్కో కుటుంబంలో సుమారు రూ.50 వేల వరకు సంపాదించుకుంటారు. ఈ డబ్బుతోనే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేస్తుంటారు.

నోటిఫికేషనే లేదు..

గతేడాది తునికాకు సేకరణకు తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ జనవరి 27న టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఫిబ్రవరి 6 నుంచి 14వ తేదీ వరకు మొదటి విడత, 21 నుంచి 28 వరకు రెండో విడత, మార్చి 10 నుంచి 16 వరకు ఆన్‌లైన్ ద్వారా టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. అయితే ఈ ఏడాది ఇంతవరకు టెండర్లకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ చేయలేదు. కనీసం తేదీలు కూడా ఖరారు చేయకపోవడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో పూర్తయిన ప్రక్రియ..

పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో తునికాకు సేకరణకు గత నెలలోనే టెండర్లు ఆహ్వానించారు. తెలంగాణలో మాత్రం ఈ ప్రక్రియకు సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే పక్క రాష్ట్రాల్లో టెండర్లు పిలవడంతో ఇక్కడి కాంట్రాక్టర్లు కూడా ఆయా రాష్ట్రాలకు వెళ్తున్నారు. ఇక్కడ జాప్యం జరుగుతుండడంతో ఆ తర్వాత టెండర్ వేసే కాంట్రాక్టర్లు కూడా కరువవుతారనే భయం కూలీల్లో నెలకొంది. గతేడాది కూడా రాష్ట్రంలో కొన్ని తునికాకు యూనిట్లకు టెండర్లు వేయకపోవడంతో అటవీ శాఖకు సైతం నష్టం వాటిల్లింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తే ఇటు కూలీలకు ఉపాధితో పాటు అటవీ శాఖకు ఆదాయం లభించే అవకాశం ఉంటుంది.

సకాలంలో ప్రూనింగ్ చేస్తేనే ప్రయోజనం

టెండర్ల ప్రక్రియ త్వరగా పూర్తయితే యూనిట్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అటవీ శాఖ అధికారులతో ఒప్పందం చేసుకుని ప్రూనింగ్ (మోడు కొట్టడం) ప్రారంభిస్తారు. కనీసం మార్చి మొదటి వారంలో మోడు కొడితేనే ఆకు సేకరణ సమయానికి చెట్లు చిగురిస్తాయి. ప్రూనింగ్ ప్రక్రియలో జాప్యం జరిగితే ఆకు సేకరణ సకాలంలో పూర్తి కాదు. తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా, కూలీలకు సైతం డబ్బు గిట్టుబాటు కాదు. కాగా, ఈ విషయమై సంబంధిత అటవీ శాఖ అధికారులను వివరణ కోరగా.. ఈనెల 20, 21 తేదీల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ప్రూనింగ్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు.

క్లుప్తంగా

పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

డీసీఓకు లేఖ అందజేసిన డైరెక్టర్లు

ఇల్లెందురూరల్: ఇల్లెందు ప్రాథమిక సహకార సంఘం వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ పది మంది డైరెక్టర్లు సోమవారం డీసీఓ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా, వారిలో ఎనిమిది మంది బీఆర్‌ఎస్ మద్దతుతో విజయం సాధించగా మిగిలిన ఐదుగురు న్యూడెమోక్రసీ మద్దతుతో విజయం సాధించారు. క్రమంగా బీఆర్‌ఎస్ నుంచి ఆరుగురు డైరెక్టర్లు, న్యూడెమోక్రసీ నుంచి నలుగురు డైరెక్టర్లు కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ క్రమంలో సోమవారం చైర్మన్ మెట్టెల కృష్ణ సహా పది మంది డైరెక్టర్లు జిల్లా అధికారులకు అవిశ్వాస పత్రాన్ని అందజేశారు. కాగా తనకు పదవిపట్ల వ్యామోహం లేదని, ప్రస్తుత పాలకులకు ఇష్టం లేకపోతే రాజీనామా చేస్తానని వైస్ చైర్మన్ బండారు శ్రీనివాస్ తెలిపారు.

రామయ్యను దర్శించుకున్న 'ఉప్పెన' డైరెక్టర్



మాట్లాడుతున్న డైరెక్టర్ బుచ్చిబాబు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారిని సోమవారం ఉప్పెన సినిమా డైరెక్టర్ బుచ్చిబాబు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆయన్ను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం డైరెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ హీరో రామ్ చరణ్‌తో తాను తీసిన చిత్రం త్వరలో విడుదల కానుందని తెలిపారు.

అప్రెంటిస్ మేళా విజయవంతం



మేళాకు హాజరైన విద్యార్థులు, యువత

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీలో గల మణుగూరు ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ మేళా విజయవంతమైంది. మేళాకు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పలు ట్రేడ్లలో ఉత్తీర్ణులైన సుమారు 165 మంది హాజరుకాగా, హైదరాబాద్, చెన్నైకి చెందిన హోల్డింగ్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 90 మందిని అప్రెంటిస్‌కు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ మేళా నిర్వహించడం హర్షణీయమని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారులు కె.శోభన్, జి రవి, సూపరింటెండెంట్ టీఎస్ జ్యోతిరాణి, ఏటీవోలు జీవి కృష్ణారావు, ఎం. శ్రీనివాసరావు, ఎ.నరసయ్య, సిబ్బంది నరేష్ పాల్గొన్నారు.

మేడారం భక్తులకు గాయాలు



వాహనం వద్ద క్షతగాత్రులు

కరకగూడెం: మేడారం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి మణుగూరు వస్తున్న క్రమంలో సోమవారం కరకగూడెం మండలంలోని మోతె ఎర్ర చెరువు మూలమలుపు వద్ద ఈకో వాహనం (కారు) ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారడంతో వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో వాహనంలో ఐదుగురు ఉండగా, ఒకరికి తీవ్ర, నలుగురు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా మణుగూరు ఆస్పత్రికి తరలించారు.

నలుగురు కూలీల కిడ్నాప్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా జేగురుగొండ ప్రాంతానికి చెందిన నలుగురు కూలీలను మావోయిస్టులు ఆదివారం సాయంత్రం కిడ్నాప్ చేశారు. మస్తాపరా గ్రామానికి చెందిన కూలీలులతీఫ్, నిజాంతో పాటు ఇద్దరు జేసీబీ ఆపరేటర్లు జల్ జీవన్ మిషన్ పనులు చేస్తుండగా.. వీరిని మావోయిస్టులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఈ పనులు చేయొద్దని కొంతకాలంగా మావోయిస్టులు డిమాండ్ చేస్తున్న నేపథ్యాన వారిని అపహరించినట్లు సమాచారం. కాగా, వీరిని వెంటనే విడుదల చేయాలని కుటుంబసభ్యులు కోరుతుండగా, కిడ్నాప్ విషయాన్ని అధికారులు ధ్రువీకరించలేదు.

ఐదుగురి అరెస్ట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ పీవీఎన్ రావు తెలిపారు. నిందితుల నుంచి రూ.2200 నగదు, రెండు కోడి పుంజులు, కోడి కత్తి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

బిల్లులు ఎప్పుడిస్తారో..?

కస్తూర్బా పాఠశాలల్లో బిల్లులు పెండింగ్

- రెండు నెలలుగా సిబ్బందికి అందని వేతనాలు
- భారంగా మారిన విద్యాలయాల నిర్వహణ



పాల్వంచలోని కస్తూర్బా పాఠశాల

పాల్వంచ: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా(కేజీబీవీ)ల నిర్వహణ భారంగా మారింది. పాఠశాలల్లో నిత్యావసర సరుకుల బిల్లులు, సిబ్బందికి వేతనాలు రావడం లేదు. జిల్లాలో ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, చండ్రుగొండ, దుమ్ముగూడెం, గుండాల, జూలూరుపాడు, కరకగూడెం, ములకలపల్లి, పినపాక, పాల్వంచ, టేకులపల్లి మండలాల్లో కస్తూర్బా గాంధీ విద్యాలయాలు నడుస్తున్నాయి. ఆయా విద్యాలయాలన్నీ రెండేళ్ల క్రితం పాఠశాలల నుంచి కళాశాలలుగా కూడా అప్‌గ్రేడ్ అయ్యాయి.

ఏడు నెలలుగా బిల్లులు రాట్లే..

జిల్లాలో 14 కేజీబీవీలు ఉండగా, వాటిలో సుమారు 3 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అనాథ, సింగిల్ పేరెంట్ కలిగిన, పేద పిల్లలు ఎక్కువ మంది చదువుతున్నారు. సుమారు 300 మంది టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాలలకు కాంట్రాక్టర్లు కూరగాయలు, పండ్లు, గుడ్లు, చికెన్, సరుకులు సరఫరా చేస్తుంటారు. విద్యాలయాల ప్రత్యేక అధికారులు స్వయంగా పాలు, గ్యాస్, స్టేషనరీ, శానిటరీ, రిపేరింగ్, మెయింటెనెన్స్‌కు సొంతంగా ఖర్చు చేస్తుంటారు. సంబంధిత బిల్లులు పంపించిన తర్వాత ఆడిట్ చేసి విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే గత సెప్టెంబర్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లకు, ప్రత్యేక అధికారులకు భారంగా మారింది. సరుకులు ఎప్పటికప్పుడు అందించడం ఇబ్బంది కరంగా మారింది.

వేతనాల్లో జాప్యం

టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు గత డిసెంబర్, జనవరి వేతనాలు ఇప్పటికీ రాలేదు. నవంబర్ వేతనం మాత్రం సంక్రాంతికి అందించారు. సుమారు 300 మంది సిబ్బంది వేతనాల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వేతనాలు రాక ఇబ్బంది..



రెండు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నాం. గతంలో ప్రతి నెలా 15వ తేదీలోగా వేతనం వచ్చేది. ఇప్పుడు ఆలస్యం అవుతోంది. సరుకుల బిల్లులు కూడా రావడంలేదు.

–వెంకటమ్మ, కార్మికురాలు

ప్రభుత్వం దృష్టిలో ఉంది



బడ్జెట్ లేక నిధులు విడుదల కావడం లేదు. ఈ విషయం ప్రభుత్వం దృష్టిలోఉంది. అన్ని చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. నిధుల కోసం మేం కూడా వేచి చూస్తున్నాం. నిధులు ఎప్పుడైనా రావొచ్చు.

–వెంకటేశ్వరాచారి, డీఈఓ

ప్రతిభకు దక్కని అవకాశం!

సింగరేణి క్రికెట్ జట్టు ఎంపికలో లోపించిన పారదర్శకత



సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ క్రికెట్ టీమ్ ఎంపికలో పారదర్శకత లోపించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 18 నుంచి ఈస్టర్న్ కోల్ ఫీల్డ్‌లో కోలిండియాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరగనుంది. ఈ నేపథ్యంలో సింగరేణి కార్మికుల జట్టును ఎంపిక చేసి, ప్రాక్టీస్ చేయాలని గత నెల 27 వెల్ఫేర్ విభాగం ప్రకటించింది. జట్టు కూర్పు సక్రమంగా జరగలేదని, క్రీడా నైపుణ్యం కలిగిన కార్మికులను ఎంపిక చేయలేదని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు. గతేడాది భూపాలపల్లిలో కంపెనీ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా, ఓ క్రీడాకారుడు ఆల్ రౌండర్‌గా ప్రతిభ చూపాడు. 18 పరుగులకే ఐదు వికెట్లు తీశాడు. కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల జట్టు విజేతగా నిలిచేందుకు కీలక పాత్ర పోషించాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ కూడా అందుకున్నాడు. కానీ ఆ క్రీడాకారుడికి ప్రస్తుత జట్టులో స్థానం కల్పించలేదు. క్రికెట్ సూపర్‌వైజర్లు పర్సనల్ జీఎంకు తప్పుడు సమాచారం ఇచ్చి జట్టులో నైపుణ్యం ఉన్న క్రీడాకారుడికి స్థానం కల్పించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా సింగరేణిలో ఐదేళ్లుగా స్పోర్ట్స్ అధికారి లేదు. ఏరియాల్లో సీనియర్ పీఓలను స్పోర్ట్స్ కో ఆర్డినేటర్లుగా, స్పోర్ట్స్ ఇన్‌చార్జిగా నియమించి నెట్టుకొస్తున్నారు. సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి నైపుణ్యం కలిగిన క్రీడాకారులకు అన్యాయం జరగకుండా చూడాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

బేకరీ షాప్ నిర్వాహకుడికి జరిమానా

పాల్వంచ: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఓ బేకరీ షాపు నిర్వాహకుడికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. పట్టణానికి చెందిన మేకల నర్సింహారావు అనే వ్యక్తి తన కూతురు పుట్టిన రోజు సందర్భంగా బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ఎ5 ఐస్ మ్యాజిక్ షాప్‌లో ఆదివారం సాయంత్రం కూల్ కేక్ కొనుగోలు చేశాడు. కేక్ కటింగ్ చేసిన అనంతరం తిన్న ముగ్గురు పిల్లలు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అతడు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం స్పందించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు బేకరీ షాపును తనిఖీ చేయడంతో అక్కడ బూజు, దోమలు పట్టిన కేక్ ఇచ్చినట్లు నిర్ధారణ కావడంతో షాపు నిర్వాహకుడు అలీకి రూ.7 వేలు జరిమానా విధించారు.



షాపులో తనిఖీ చేస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ రావు

మూడోసారీ బీజేపీ గెలుస్తుంది..

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్



మాట్లాడుతున్న రంగాకిరణ్

కరకగూడెం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడా బీజేపీనే గెలుస్తుందని, మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్ అన్నారు. 'గావ్ చలో అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన మండలంలోని అనంతరం గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగినపల్లి నాగేశ్వరరావు ఇంట్లో పల్లె నిద్ర చేశారు. సోమవారం ఉదయాన్నే పలు గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. డంపింగ్ యార్డ్, శ్మశాన వాటిక, రైతు వేదికలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత అనంతారం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీతోనే సుస్థిర పాలన సాధ్యమని పేర్కొన్నారు. బీజేపీతోనే నవ తెలంగాణ సాధ్యమని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ విజయాన్ని ఆపలేరని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, అసెంబ్లీ కన్వీనర్ పున్నం బిక్షపతి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరాం చంద్రయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కొమ్ము వంశీ, దంతులూరి రామచంద్రరాజు, దూలిపూడి శివప్రసాద్, గోగు అనిల్, పాయం లక్ష్మీనారాయణ, రాజు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో అగ్ని ప్రమాదం

రూ.9.90 లక్షల మేర ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: వినాయకపురంలో ఉన్న శ్రీ సాయి రామ రైస్ మిల్లులో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా, భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. నైట్ వాచ్‌మెన్ 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా, పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే రైస్‌మిల్లు వద్ద ఉన్న సుమారు 8 వేల బస్తాల ధాన్యం, బియ్యం కాలిపోయాయి. సుమారు రూ.9.90 లక్షల మేర నష్టం వాటిల్లిందని అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. సిబ్బంది అప్రమత్తతతో మరో రూ.1.90 కోట్ల విలువైన ధాన్యం బస్తాలను సురక్షితంగా కాపాడినట్లు చెప్పారు.

ఘటనపై అనుమానాలు.?

రైస్‌మిల్లు బాధ్యుడు, అగ్ని మాపక శాఖ అధికారులు చెబుతున్న నష్టం లెక్కల్లో భారీగా వ్యత్యాసం ఉండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితమే అశ్వారావుపేట మండలంలో నారాయణపురం, ఊట్లపల్లి, ఆసుపాక గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులనుంచి కొనుగోలు చేసిన సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం బస్తాలు రైస్ మిల్లులో అప్పగించారు. అయితే ధాన్యం బస్తాలకు మంటలు వ్యాపించలేదని రైస్‌మిల్లు బాధ్యుడు చెబుతున్నాడు. నష్టం స్వల్పంగానే జరిగిందని, ఖాళీ ధాన్యం సంచులే కాలిపోయాయని రైస్‌మిల్లు నిరాహకుడు చెబుతుండటం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. కాగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు విచారిస్తే వాస్తవం తేలనుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



గోపి (ఫైల్)

టేకులపల్లి: బైక్ అదుపు తప్పి కందకంలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని తావుర్యాతండా గ్రామానికి చెందిన గుగులోత్ గోపి (36) టేకులపల్లిలో హమాలీ వర్కర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతని ఇద్దరు కుమార్తెలు మధిరలో హాస్టల్ ఉంటూ చదువుకుంటున్నారు. ఆదివారం కుమార్తెలను చూసేందుకు గోపి భార్య రోజా మధిర వెళ్లింది. తిరిగి రాత్రి 9 గంటలకు టేకులపల్లికి వచ్చి ఫోన్ చేయగా, ఆమెను తీసుకెళ్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై తడికలపూడి మార్గంలో బయల్దేరాడు. గురుకులం సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న కందకంలో పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. భార్య రోజా పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో వేరే వాహనంలో ఇంటికి చేరింది. రాత్రి పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వచ్చిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రమణారెడ్డి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు సోమవారం ఆర్‌సీఓక్లబ్‌లో సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఎం.శాలేంరాజు మాట్లాడుతూ సెల్‌లో ఫోన్‌కు వచ్చే మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఐటీ డీజీఎం ఎం.శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అధికారులు రామ్‌కుమార్, కోటిరెడ్డి, రామకృష్ణ, సుమలత, యోహాన్, మేనేజర్ శివకేశవరావు పాల్గొన్నారు.

పత్తి తూకంలో మోసం

దుమ్ముగూడెం: అమాయక రైతులను వ్యాపారులు, దళారులు తూకాల్లో మోసం చేస్తున్నారు. సోమవారం మండలంలోని సింగారం గ్రామంలో సారపాకకు చెందిన పత్తి వ్యాపారులు గ్రామానికి చెందిన వర్సా చిన్నయ్య దగ్గర పత్తి కాంటా వేశారు. దాదాపు 80 బోరేల వరకు కాంటా వేయగా, రైతులకు తూకంలో అనుమానం వచ్చింది. దీంతో మరోచోట కాంటా వేయగా ఒక్కో బోరేనికి దాదాపు 30 కేజీల పత్తి తక్కువగా చూపినట్లు తేలింది. గ్రామస్తులు నిలదీసి గొడవ చేయగా, సదరు వ్యాపారి రూ.లక్ష చెల్లించి అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం.

ఇసుక లారీ దగ్ధం



లారీ డీజిల్ ట్యాంకర్ వద్ద ఎగిసిపడుతున్న మంటలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఐటీఐ కళాశాల వద్ద సోమవారం మధ్యాహ్నం ఇసుక లారీ పాక్షికంగా దగ్ధమైంది. ఇసుక లారీ మణుగూరు ర్యాంపు నుంచి హుజూర్‌నగర్‌కు వెళ్తోంది. ఈ క్రమంలో సుభాష్‌నగర్ పంచాయతీ వద్ద డీజిల్ ట్యాంకర్ వద్ద ఒక్కసారిగా పొగలు వచ్చాయి. పక్క నుంచి వెళ్తున్న ద్విచక్రవాహన చోదకుడు అప్రమత్తం చేయడంతో డ్రైవర్ లారీని ఆపాడు. స్థానికుల సమాచారంతో ఫైర్ ఇంజన్ వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే డీజిల్ ట్యాంకర్, నాలుగు టైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. డీజిల్ ట్యాంకర్ వద్ద ఉన్న సెన్సార్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయని డ్రైవర్ తెలిపారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన నాగమల్లీశ్వరి దేవికి 2021 సంవత్సరంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన బుల్లయ్యతో వివాహం జరిగింది. వివాహం జరిగాక 4 నెలల నుంచి మానసికంగా, శారీరకంగా భర్త వేధిస్తున్నాడని సోమవారం భద్రాచలం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

ఇద్దరికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: డివైడర్‌ను బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో ఇల్లెందు– మహబూబాబాద్ ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి జరిగింది. బయ్యారం మండలం మిర్యాలపెంట గ్రామానికి చెందిన రవి, ఇల్లెందు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రమేష్ బైక్‌పై చల్లసముద్రం నుంచి ఇల్లెందుకు వస్తున్నారు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న డివైడర్‌ను ఢీకొనగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలించారు. కాగా డివైడర్ నిర్మాణ పనుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- వంద శాతం ఫలితాలు సాధించేలా తర్ఫీదు
- ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనులు, ఆదివాసీల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున స్పెషల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తరచుగా పరీక్షలు నిర్వహిస్తూ వెనుకబడిన వారిని తీర్చిదిద్దాలని, తద్వారా వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా చూడాలని తెలిపారు. కాగా, గిరిజన దర్బార్‌లో అందిన దరఖాస్తులపై పీఓ మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, వివిధ శాఖల అధికారులు తానాజీ, వెంకటేశ్వరరాజు, సురేష్‌బాబు, మునీర్‌పాషా, ఎఫ్తార్ శ్రీనివాస్, ప్రభాకర్ రావు, భాస్కరన్, నరేష్, వెంకటేశ్వర్లు, సావిత్రి, పద్మావతి, సుగుణ, హరికృష్ణ, ప్రసాద్, నాగభూషణం, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ క్రీడాకారిణికి అభినందన



గీతహర్షిణిని అభినందిస్తున్న పీఓ, అధికారులు

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల విద్యార్థిని రవ్వ గీతహర్షిణిని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ అభినందించారు. అంకంపాలెం పాఠశాలలో చదువుతున్న గీత హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించి పంజాబ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈమే రకు జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు. గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజు, స్పోర్ట్స్ ఆఫీసర్ బి.గోపాల్‌రావు, ఏఎస్‌ఓ కె.వెంకటనారాయణ, హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు, పీఈటీ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

- యథేచ్ఛగా అక్రమరవాణా
- పోలీసు ఆదేశాలూ బేఖాతరు



టేకులపల్లిలో అర్ధరాత్రి ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

టేకులపల్లి: మండలంలో ఇసుక దందా ఆగడం లేదు. వాహనాలు సీజ్ చేస్తున్నా, బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నా అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. గత జనవరి 9న మండలంలోని తొమ్మిదోమైలుతండా వద్ద ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారుల వాహనం ధ్వంసమైంది. అటవీశాఖ సిబ్బందికి త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనను అటవీ, పోలీస్ శాఖలు సీరియస్‌గా తీసుకున్నాయి. దాడికి పాల్పడ్డ డ్రైవర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ట్రాక్టర్లను సీజ్ చేశారు. టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి 20 మంది ట్రాక్టర్ యజమానులను గత నెల 10న బైండోవర్ చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ రోహిత్ రాజు కూడా ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు..

ఇసుక అక్రమంగా రవాణా చేయొద్దని పోలీసులు బైండోవర్ చేసినా, హెచ్చరికలు జారీ చేసినా ట్రాక్టర్ యజమానుల్లో మార్పు రావడంలేదు. గత నెల 10వ తేదీ తర్వాత రెండు వారాలపాటు గప్‌చుప్‌గా ఉన్నారు. అనంతరం మళ్లీ దందా సాగిస్తున్నారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానంగా బొమ్మనపల్లి, శంభునిగూడెం, కోయగూడెం, టేకులపల్లి, మద్రాస్‌తండా, బోడు, కిష్టారం, లచ్చగూడెం, గంగారం తదితర ప్రాంతాల ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు శంభునిగూడెం, చంద్రుతండా, మద్రాస్‌తండా, మేళ్ళమడుగు, లచ్చగూడెం, కిష్టారం, బోడు, గంగారం తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసు, అటవీ, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణా చేయొద్దని ఇప్పటికే 20 మంది ట్రాక్టర్ డ్రైవర్లను బైండోవర్ చేశాం. ఇంకా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా ఇసుక రవాణా జరిగితే మాకు సమాచారం ఇవ్వాలి.

– జి.రమణారెడ్డి, ఎస్‌ఐ టేకులపల్లి